క్లుప్తంగా

ఉత్సాహంగా 5కే రన్


5కే రన్‌కు ప్రారంభిస్తున్న డాక్టర్ రమేష్

దెందులూరు: ఆశ్రం హాస్పిటల్స్ కాలేజీ ఆధ్వర్యంలో ఆదివారం 5 కే రన్ నిర్వహించారు. యూరాలజిస్ట్ డాక్టర్ రమేష్ ఆశ్రం యోగా క్లబ్ ఆధ్వర్యంలో ఇది సాగింది. ఈ సందర్భంగా మెడికల్ కాలేజ్ వైస్ ప్రిన్సిపల్ వేణుగోపాల్ రాజు మాట్లాడుతూ మారుతున్న ఆహారపు అలవాట్లు, సాంకేతిక పరిజ్ఞానానికి అధిక సమయం కేటాయించడంతో మానవుడి ఆరోగ్యానికి ప్రస్తుతం పూర్తిస్థాయి భద్రత లేదన్నారు. యువతతో పాటు ప్రతి ఒక్కరికి వ్యాయామం, తగిన విశ్రాంతి అవసరమన్నారు. కార్యక్రమంలో మెడికల్ కాలేజీ, నర్సింగ్ కాలేజీ అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

మద్యం సీసాలు స్వాధీనం

నిడమర్రు: మద్యం అక్రమంగా నిల్వ చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై వీర ప్రసాద్ హెచ్చరించారు. ఆదివారం మండలంలోని అడవికొలనులో దాడులు నిర్వహించగా కేతా వెంకట సత్యనారాయణ అనే వ్యక్తి ఇంట్లో నిల్వ చేసిన 180 ఎంఎల్ బాటిళ్లు 20 స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

దేవుని మార్గంలో నడుచుకోవాలి

భీమడోలు: క్రైస్తవులంతా దేవునికి ఇష్టులుగా జీవించాలని, ఆయన మార్గంలో నడుచుకుంటూ పరిపూర్ణ విశ్వాసులుగా ఎదగాలని ఏలూరు మేత్రాసనం ఛాన్సలర్ ఫాదర్ బాబు జార్జ్ అన్నారు. భీమడోలు ఆర్‌సీఎం చర్చి నందు 38వ సజీవధారల సువార్త కూడికలు పేరిట ఆరోగ్య మాత మహోత్సవాలు శనివారం రాత్రి నుంచి ఘనంగా ప్రారంభమయ్యాయి. విచారణ కర్త ఫాదర్ షింటో థామస్ ఆధ్వర్యంలో గురువుల జ్యోతి ప్రజ్వలన చేశారు. బాబు జార్జ్ దివ్య పూజాబలిని అర్పించారు. విశ్వాసులను ఉద్దేశ్యించి వాక్యోపదేశాన్ని అందించారు. కర్నూలు సీనాయి ధ్యాన కేంద్రం ఆజిష్ దివ్యసప్రసాద స్తుతి ఆరాధనను నడిపించారు. కుటుంబమంతా దేవుని పట్ల మంచిగా నడుచుకోవాలని, తద్వారా జీవితాల్లో మార్పు వస్తుందన్నారు.

సీపీఎం నుంచి ఇద్దరు బహిష్కరణ

ఏలూరు (టూటౌన్): పి.కిషోర్, బి.జగన్నాథరావును సీపీఎం ప్రాథమిక సభ్యత్వం నుంచి బహిష్కరించినట్లుగా సీపీఐ(ఎం) జిల్లా కార్యాదర్శి ఏ.రవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతుండటంతో పార్టీ నుంచి తొలగించినట్లు చెప్పారు.

పార్కింగ్ స్థలాలు లేక ఇక్కట్లు

- నగరపాలక సంస్థ ఎదురుగా ఆటో స్టాండ్ ఖాళీ చేయించిన అధికారులు
- ప్రత్నామ్నాయం చూపకపోవడంతో ఆటో కార్మికుల ఆందోళన


స్టాండ్ తొలగింపుపై ఆందోళన చేస్తున్న ఆటో డ్రైవర్లు, సీఐటీయూ నాయకులు


ఆటో స్టాండ్ వద్ద రోడ్డుకు అడ్డంగా పెట్టిన సిమెంట్ దిమ్మలు

ఏలూరు (టూటౌన్): ఏలూరు నగరంలో దాదాపు 5 వేలకు పైగా ఆటోలు ఉన్నాయి. ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుస్తూ, జీవనోపాధి పొందుతూ వారి కుటుంబాలను పోషించుకుంటున్నారు. నగరంలో ఆటోలను నిలిపేందుకు సరైన పార్కింగ్ స్థలాలు లేక ఆటో డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దీనిపై ఉన్నతాధికారులకు ఎన్నిసార్లు వినతి పత్రాలు అందించినా ఫలితం కన్పించలేదు. పైగా వివిధ కారణాలతో ఉన్న ఆటో స్టాండ్‌లను సైతం తొలగించేస్తుండటంతో ఆటో డ్రైవర్లు ఆందోళన బాట పట్టారు.

నగరంలో 70 వరకు ఆటో స్టాండ్లు

ఏలూరు కార్పొరేషన్ పరిధిలో 50 డివిజన్లు విస్తరించి ఉండగా వీటి పరిధిలో 70 వరకు ఆటో స్టాండ్లు ఉన్నాయి. సగం ఆటోలు నిలిపేందుకు చోటు లేక చెట్ల కింద, రోడ్ల పక్కన, ప్రభుత్వ కార్యాలయాల లోపల ఎక్కడ ఖాళీ ఉంటే అక్కడ పెట్టుకుంటున్నారు. 70 ఆటో స్టాండ్లలో సగం వరకు పాత బస్టాండ్ నుంచి కొత్త బస్టాండ్ వరకు విస్తరించిన మార్గంలో, చుట్టుపక్కల ఉండటం విశేషం.

ఆటో స్టాండ్ తొలగించడంపై డ్రైవర్ల ఆందోళన

ఏలూరు నగర పాలక సంస్థ ఎదురుగా 2001 నుంచి ఆటో స్టాండ్ ఉంది. ఇటీవల మున్సిపల్ అధికారులు ప్రజాప్రతినిధుల ప్రోద్బలంతో ఉన్న ఆటో స్టాండ్‌ను తొలగించేశారు. దీంతో ఈ స్టాండ్‌ను వినియోగించుకునే దాదాపు 300 మంది ఆటోడ్రైవర్లు తమ వాహనాలు నిలుపుకునేందుకు చోటు లేక అవస్థలు పడుతున్నారు. అద్దెల కోసం తమ ఆటో స్టాండ్‌ను తొలగించడం దుర్మార్గమంటూ ఆటో డ్రైవర్లు రోడ్డెక్కి ఆందోళనలు, ధర్నాలు చేసారు. మున్సిపల్ అధికారులు, ఎమ్మెల్యేకు సైతం వినతి పత్రాలు అందజేశారు. అయినా వీరి ప్రయత్నం అరణ్య రోదనగానే మిగిలిపోయింది. తాజాగా అసలు అక్కడ ఆటో స్టాండే లేదంటూ అధికారులు, ప్రజాప్రతినిధులు ఎదురు ప్రశ్నిస్తుండటంతో ఆటో డ్రైవర్లుకు ఏమి చేయాలో పాలు పోవడం లేదు.

పార్కింగ్ స్థలాలు కేటాయించాలి

నగరంలో ఆటోలను నిలిపేందుకు వీలుగా పార్కింగ్ స్థలాలు కేటాయించాలని ఆటో యూనియన్‌ల నాయకులు కోరుతున్నారు. కనీసం ఉన్న వాటికైనా రక్షణ కల్పించేలా అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే వన్‌టౌన్ మున్సిపల్ ఆఫీసు సెంటర్‌లోని ఆటో స్టాండ్‌ను ఇతర అవసరాల కోసం తొలగించి ఆటో డ్రైవర్ల కడుపు కొట్టడం ఎంత వరకు సమంజసమంటూ ప్రశ్నిస్తున్నారు.

మూడుసార్లు మార్చారు


ఏలూరు జిల్లా కోర్టు సెంటర్‌లో ఆటో స్టాండ్ గత 20 సంవత్సరాలుగా ఉంది. ఈ 20 ఏళ్లల్లో స్టాండ్‌ను మూడు సార్లు మార్చారు. చివరికి పోలీస్ కల్యాణ మండపం దగ్గరకి మార్చారు. ఇక్కడ కూడా పెట్రోల్ బంక్ నిర్మించి మమ్మల్ని ఖాళీ చేయించేసారు. తక్షణం మాకు పార్కింగ్ స్థలాన్ని ఈ ప్రాంతంలో కేటాయించాలి.

కోరాడ అశోక్ కుమార్, ఆటో డ్రైవర్, ఏలూరు

పార్కింగ్ స్థలాన్ని లాగేసుకున్నారు


మున్సిపల్ ఆఫీసు సెంటర్‌లోని ఆటో స్టాండ్ స్థలాన్ని అధికారులు లాగేసుకున్నారు. 2001 నుంచి ఆటోస్టాండ్ ఈ ప్రాంతంలో ఉంది. ఇప్పటికే రెండు సార్లు పార్కింగ్ స్థలాన్ని మార్చారు. స్థలాన్ని లీజుకు ఇచ్చామని చెప్పి మున్సిపల్ అధికారులు మా ఆటో పార్కింగ్ స్థలాన్ని బలవంతంగా లాగేసుకున్నారు.

ఎస్.వైష్ణవ కుమార్, శ్రీ వినాయక ఆటో స్టాండ్, ఏలూరు

కొత్తవి ఇవ్వరు.. ఉన్నవి తీసేస్తారు


ఆటో కార్మికుల పరిస్థితి ముందు గొయ్యి వెనుక నుయ్యి అనే చందంగా తయారైంది. కొత్త ఆటో స్టాండ్‌లు కేటాయించరు. ఉన్న వాటిని తొలగిస్తున్నారు. ఇదెక్కడి అన్యాయం అని ప్రశ్నిస్తే మీకు ఈ ప్రాంతంలో అసలు ఆటో స్టాండే లేదు అని సమాధానమిస్తున్నారు.

జి.గోపీ, జిల్లా కార్యదర్శి, ఏపీ ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్ యూనియన్

ఎమ్మెల్యే మాటలు విడ్డూరం


గత 30 ఏళ్లుగా ఆటో నడుపుతున్నారు. మున్సిపల్ సెంటరులోనే ఆటో నిలుపుతున్నాను. ఈ సెంటర్లో ఆటో స్టాండ్ ఏర్పాటు చేసిన వారిలో నేనూ ఒకడిని. ఇక్కడ అసలు స్టాండే లేదని స్థానిక ఎమ్మెల్యే అనడం విడ్డూరంగా ఉంది. మేము 2001లో యూనియన్ రిజిస్ట్రేషన్ చేయించాం. అప్పటి నుంచి మున్సిపల్ సెంటర్‌లోని స్టాండ్ ఉంది.

కల్లూరి రాజారావు, అధ్యక్షుడు, మున్సిపల్ ఆటో స్టాండ్, ఏలూరు

నూకాలమ్మ ఆలయం వద్ద అన్నసమారాధన


భక్తులకు అన్న ప్రసాదం పంపిణీ చేస్తున్న బడేటి మీనా

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక కొత్తపేట శ్రీ నూకాలమ్మ అమ్మ వారి ఆలయంలో ఇటీవల ముగిసిన అమ్మవారి 45వ జాతర మహోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం ఆలయం వద్ద భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే బడేటి చంటి సతీమణి బడేటి మీనా, ఆలయ కమిటీ చైర్మన్ ధావాల రంగా కమిటీ సభ్యులతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో జంప సూర్యనారాయణ, సగిరెడ్డి చిరంజీవి, త్రిపర్ణ రాజ, ఉల్లింగల సురేష్, నక్క నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ధ్యానంతో ప్రయోజనాలు అనేకం

భీమడోలు: ధ్యానం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయని, ప్రతి ఒక్కరూ ధ్యానంపై దృష్టి సారించి సంపూర్ణ ఆరోగ్యవంతులు కావాలని సీనియర్ పిరమిడ్ మాస్టర్ దుర్గాప్రసాద్ అన్నారు. భీమడోలులో ఆదివారం ధ్యానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నిర్వాహకులు జి.అప్పన్న అధ్యక్షత వహించారు. దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ధ్యానం వల్ల సత్య సాక్షాత్కారం, స్వీయ సాక్షాత్కారం పెంపొందడం ద్వారా ఆరోగ్యవంతులవుతారన్నారు. జీవిత దృక్పథాన్ని మార్చుకునేందుకు చక్కని మార్గమన్నారు. వ్యాధి నిరోధక శక్తి పెరిగి శారీర రుగ్మతలు దూరమవుతాయన్నారు. ఒత్తిడి, కోపం, క్లిష్ట పరిస్థితులు తదితర వాటిపై పట్టు సాధిస్తారన్నారు. ప్రతి ఒక్కరూ శాఖాహారాన్ని తినాలని, మాంసహారాన్ని విడనాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు రాంబాబు, పంట్ల రామారావు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సైకిల్ ర్యాలీ


నగరంలో జరిగిన సైకిల్ ర్యాలీలో పాల్గొన్న బాలబాలికలు

ఏలూరు రూరల్: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటేనే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా పయనిస్తుందని జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి బి.శ్రీనివాసరావు అన్నారు. రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు ఆదివారం ఉదయం 7 గంటలకు ఏలూరులో ఫిట్ ఇండియా సైకిల్ ర్యాలీ చేపట్టారు. ప్రతిరోజూ కనీసం 30 నిమిషాలు శారీరక శ్రమ అవసరమన్నారు. ఇందుకోసం క్రీడలు, వ్యాయామం, నడక, పరుగు, సైక్లింగ్, స్విమ్మింగ్, యోగా సాధన చేయాలన్నారు. ఆరోగ్యవంతమైన సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఇందుకోసం ఫిట్ ఇండియా పేరుతో ప్రజల్లో అవగాహన కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం స్విమ్మింగ్ నేషనల్ మెడలిస్ట్ బలగా స్వామి జెండా ఊపడంతో క్రీడాకారులు అల్లూరి సీతారామరాజు స్టేడియం నుంచి బయలదేరి నగరంలో ర్యాలీ నిర్వహించారు. సాయ్ సెంటర్ ఇన్‌చార్జి వినాయక్ ప్రసాద్, వెయిట్ లిఫ్టింగ్ కోచ్ ఎం.రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

హక్కుల కోసం పోరాడేది కమ్యూనిస్టులే



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రామారావు

ఏలూరు (టూటౌన్): శ్రమ జీవుల హక్కుల కోసం పోరాడేది కమ్యూనిస్టులేనని ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చలసాని వెంకట రామారావు అన్నారు. విభజించి పాలించే సిద్ధాంతం తమకు లేదని స్పష్టం చేశారు. ఏలూరులోని సీపీఐ జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవన్‌లో జరిగిన ప్రత్యేక సమావేశానికి ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్ డాంగే అధ్యక్షత వహించారు. నగరంలో ప్రజా సంఘాల నాయకుల ఆధ్వర్యంలో కమ్యూనిస్టు భావజాలం కలిగిన 50 మంది సీపీఐ ప్రజా సంఘంలో చేరారు. ఈ కార్యక్రమంలో రామారావు, సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్యలు వారికి ఎరుపు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. జిల్లా కార్యదర్శి కృష్ణ చైతన్య మాట్లాడుతూ దేశంలో బీజేపీ ప్రభుత్వం ఆర్ఎస్ఎస్ భావజాలాన్ని ముందుకు తీసుకువెళుతుందని విమర్శించారు. వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో పాత, కొత్త కలయికలతో ఐక్యంగా ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారు. ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బుచ్చిబాబు, నాయకులు కృష్ణమాచార్యులు, పుప్పాల కన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి

దెందులూరు: ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఏలూరు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు జరజాపు రంగారావు, ఎంపీటీసీ సున్నా నరేష్, గుండుగొలను రిటైర్డ్ గ్రంథాలయ అధికారి బెజవాడ ప్రసాద్ అన్నారు. ఉంగ్రాజవరం కమ్యూనిటీ హాల్లో రామేన పైడారావు ప్రభావతి జ్ఞాపకార్థం, శ్రీనివాస మెడికల్ షాపు ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆర్థోపెడిక్ వైద్యాధికారి హరికృష్ణ , గైనకాలజీ వైద్యాధికారి గీతిక వైద్య సిబ్బందితో రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు.

వేడుకగా రాములోరి కల్యాణం

- వాడవాడలా సీతారాముల కల్యాణం
- పానకాలు, ప్రసాదాల పంపిణీ


రామకోటి ప్రాంగణంలో విశేష అలంకరణలో కల్యాణ రాముడు


కొత్తపేట వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న భక్తులు


అమీనాపేటలో పట్టు వస్త్రాలు తీసుకొస్తున్న ఎస్పీ దంపతులు


విద్యుత్ రామాలయంలో కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న ఎస్ఈలకు జ్ఞాపికలు అందిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): శ్రీరామనవమి మహోత్సవాలు నగరంలో ఆదివారం అత్యంత వైభవంగా జరిగాయి. వాడవాడలా సీతారాముల కల్యాణం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా రామాలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఎండల తీవ్రతలకు వెరవకుండా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణ మహోత్సవాలను కన్నులారా చూసి మొక్కులు చెల్లించుకున్నారు. కళ్యాణం అనంతరం భక్తులకు వడపప్పు, పానకం పంపిణీ చేశారు. శ్రీరామనవమిని పురస్కరించుకుని అన్న సమారాధన నిర్వహించారు.

అమీనాపేటలో..

అమీనాపేటలో జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయము వద్ద ఉన్న శ్రీ దాసాంజనేయ స్వామి దేవాలయంలో 90వ శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవంలో ఎస్పీ కొమ్మి ప్రతాప శివ కిషోర్, జాయింట్ కలెక్టర్ ధాత్రి రెడ్డి దంపతులు పాల్గొన్నారు. ముత్యాల పందిరిలో సీతారాముల కల్యాణ మహోత్సవం, మంగళ సూత్రధారణ, ముత్యాల తలంబ్రాలు తంతులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఇలాంటి సంప్రదాయ కార్యక్రమాలు మన సంస్కృతిని భావితరాలకు పరిచయం చేస్తాయన్నారు. ఉత్సవాల్లో పోలీస్ కుటుంబాలు, స్థానిక ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సాయంత్రం ఊరేగింపు ఉత్సాహ భరిత వాతావరణంలో నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక భజన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాల్లో జిల్లా అదనపు ఎస్పీ అడ్మిన్ ఎన్.సూర్యచంద్రరావు, ఏఆర్ అదనపు ఎస్పీ ఎన్ఎస్ఎస్ శేఖర్, డీఎస్పీ డీ.శ్రావణ్ కుమార్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ మల్లేశ్వర రావు, ఏఆర్ డీఎస్పీ చంద్రశేఖర రావు, ఆర్ఐ పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ రామాలయంలో..

అమీనాపేటలోని విద్యుత్ రెవెన్యూ కార్యాలయం ఆవరణలోని విద్యుత్ రామాలయంలో 20వ వార్షిక శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవ వేడుకలు విద్యుత్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, ఆధ్యాత్మిక ప్రవచనాలు అలరించాయి. అనంతరం అన్న సమారాధన కార్యక్రమంలో సుమారు 2 వేల మంది భక్తులు పాల్గొని స్వామి వారి ప్రసాదం స్వీకరించారు. ఈ కల్యాణ మహోత్సవంలో ఏలూరు సర్కిల్ ఎస్ఈ పీ. సాల్మన్ రాజు, భీమవరం సర్కిల్ ఎస్ఈ ఏ.రఘునాథ బాబు పాల్గొని చిన్నారులకు బహుమతులు అందచేశారు.

40వ డివిజన్‌లో..

స్థానిక 40వ డివిజన్‌లో ఫ్రెండ్స్ యూనిటీ సెంటర్ వద్ద శ్రీరామ మందిరంలో సీతారామ స్వామి కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం 9 గంటలకు శ్రీవారి దివ్య తిరు కళ్యాణ మహోత్సవం, సాయంత్రం 7 గంటల నుంచి రథోత్సవం నిర్వహించారు. ఈ కళ్యాణ మహోత్సవంలో నగర మేయర్ షేక్ నూర్జహాన్, పెదబాబు దంపతులు పాల్గొన్నారు.

రామకోటి ప్రాంగణంలో..

స్థానిక రామకోటి ప్రాంగణంలోని శ్రీరామ మందిరంలో శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారికి విశేష పూజలు నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వితరణ చేశారు. ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు కొట్టు మధు వెంకట రావు, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గాదంశెట్టి రమేష్ కుమార్, వేమా వెంకట సురేష్ కుమార్, కార్యదర్శి మానేపల్లి రామారావు కార్యక్రమాలు పర్యవేక్షించారు.

పవర్‌పేటలో..

స్థానిక పవర్‌పేట బడేటి వారి వీధిలోని శ్రీ కోదండ రామాలయంలో సీతారాముల కళ్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు కల్యాణ కార్యక్రమంలో కూర్చోగా అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వితరణ చేశారు. స్థానిక రామచంద్ర రావు పేట సుబ్బమ్మ దేవి స్కూల్ రోడ్డులోని శ్రీ కోదండ రామాలయంలో, దొండపాడు శ్రీ దత్త నాథ క్షేత్రంలో, నరసింహరావు పేటలోని శ్రీ షిరిడీ సాయి మందిరంలో, కొత్తపేట శ్రీ కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయం, ఆదివారపు పేట శ్రీ సాయిబాబా ప్రేమ మందిరం, శేఖర్ వీధిలోని శ్రీ రామ మందిరంలో శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించారు.

కళారత్న, ఉగాది పురస్కార గ్రహీతలకు సత్కారం


పురస్కార గ్రహీతలను సన్మానిస్తున్న అతిథులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరానికి చెందిన హిందూ యువజన సంఘం ఆధ్వర్యంలో స్థానిక వైఎంహెచ్ఏ హాలులో ఆదివారం సాయంత్రం శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సీతారామ లక్ష్మణ ఆంజనేయ స్వామిని సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వంచే కళారత్న (హంస) అవార్డు, ఉగాది పురస్కారాలు పొందిన ఏలూరుకు చెందిన కళాకారులను సత్కరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ ఏలూరుకు చెందిన కళాకారులను కళారత్న, ఉగాది పురస్కారాలతో సత్కరించడం ఎంతో గౌరవ సూచికమని అన్నారు. మాజీ ఎమ్మెల్యే అంబికా కృష్ణ మాట్లాడుతూ సాంస్కృతిక కళా చరిత్రలో వైఎంహెచ్ఏ విశిష్ట స్థానాన్ని కలిగి ఉందన్నారు. కూచిపూడి నృత్య గురువు కళారత్న ఏ.పార్వతి రామచంద్రన్, ఉగాది పురస్కార గ్రహీతలు రంగస్థల నటుడు దువ్వి రామారావు, సాహితీవేత్త జంధ్యాల వెంకట శాస్త్రిలను సత్కరించారు. పరిమి సావిత్రి బృందం శ్రీరామ గానామృతం శ్రోతలను అలరించింది. పార్వతీ రామచంద్రన్ శిష్య బృందం ప్రదర్శించిన హనుమాన్ చాలీసా కూచిపూడి నృత్య రూపకం ఆకట్టుకుంది. వైఎంహెచ్ఏ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యర్రా సోమలింగేశ్వర రావు, కేవీ సత్యనారాయణ, ఉపాధ్యక్షులు కేకే గుప్తా, ఇరదల ముద్దుకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	20	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	24	చిక్కుడు కాయలు	54
వంకాయలు (కాంతులు)	26	బీన్లచిక్కుడు	84
వంకాయలు (తెలుపు)	26	చామదుంపలు	54
బెండకాయలు	28	ములక్కాడలు	08, 10
పచ్చిమిర్చి	30	కంద	76
కాకర కాయలు	30-36	బీట్‌రూట్	30
బీరకాయలు	28	కీరా దోస	30
బీరకాయలు (పందిరి)	34	ఫ్రెంచ్‌బీన్స్	100
క్యాబేజీ	16	అల్లం	60
క్యారెట్	34	కొత్తిమీర (కట్ట)	20
దొండకాయలు	26	పాలకూర	10
బంగాళదుంపలు	30	తోటకూర	10
ఉల్లిపాయలు	28	చుక్కకూర	10
గోరుచిక్కుడు	36	గోంగూర	07-10
దోసకాయలు	24	పుదీనా	05
ఆనబకాయ (1)	20	క్యాప్సికమ్	60
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	40

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	32
ఏలూరు - జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	33
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	38
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	15
ఏలూరు - తిరుపతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	23
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.15	4822	25
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	24
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	22
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	27
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	30
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	26
ఏలూరు - తిరుపతి	16.00	4830	30